# సంఘర్షణ

## -కె. ఆదర్శ సామ్రాట్

''ఏమిట్రా అలా వున్నావ్?''

హఠాత్తుగా విన్పించిన మాటకు రాహుల్ ఉలిక్కిపడ్డాడు. ఎదురుగా ప్రసాద్ నిలబడి వున్నాడు!

ఒక నిర్జీవమైన నవ్వు అతడి పెదవుల మీద విరిసి మాయమయ్యింది. ఆ నవ్వులో ఎన్నెన్నో అర్ధాలు. మరుక్షణం ప్రసాద్ అక్కడ లేనట్లే మళ్లీ తనలో తను మునిగిపోయాడు.

ఎక్కడున్నాడు తను? బస్ షెల్టర్‌లో! ఇక్కడ కూర్చుని ఎక్కాల్సిన బస్సు వదిలేసి ఇలా ఎంతసేపటి నుండి బాధపడుతూ వున్నాడు? అసలీ బాధకు సిగ్గూ శరమూ ఏమీ ఉండవా? సమయము సందర్భము, స్థలము- గిలము ఏమీ చూసుకోదా? ఎప్పుడుపడితే అప్పుడు పుట్టి, ఎక్కడికి పోతే అక్కడికి అలా నీడలా వస్తూనే వుంటుందా?....అతనికి ఉన్నట్లుండి తన చిన్నప్పుడు చదివిన ఓ కథ జ్ఞాపకం వచ్చింది.

ఓ గురువుగారు తన ముగ్గురు శిష్యులకూ మూడు పావురాలు ఇచ్చి, వాటిని ఏ జీవీ చూడకుండా చంపి రమ్మంటాడు. నల్లనిబట్టను పావురం మీద కప్పి దాని గొంతు నులిమి చంపేస్తాడు ఒక శిష్యుడు. గాఢమైన చీకటిలో పావురం గొంతు నులిమి చంపేస్తాడు రెండో శిష్యుడు. చీమ కూడా కనిపించని చోటికి వెళ్ళి, పావురాన్ని చంపబోతాడు మూడో శిష్యుడు. కాని...పావురం కళ్లు తనవైపే చూస్తున్నట్టనిపించి అతని ఒళ్లు జలదరిస్తుంది! ఏ ప్రాణీ చూడకుండా ఒక ప్రాణిని చంపడం అసాధ్యం అని గ్రహించి, గురువు మెప్పు పొందుతాడు.

ఇప్పుడు తన మనసులో వున్న బాధ కూడా సరిగ్గా ఆ పావురం కళ్లలానే వుంది. ఎక్కడికి పోయినా తనను వేటాడుతోంది.

''ఉలుకూ పలుకూ లేకుండా ఆ మౌనమేమిట్రా?'' ఈసారి రాహుల్ భుజం మీద సన్నగా చరిచాడు ప్రసాద్.

''సారీరా. ఐయామ్ వెరీవెరీసారీ.'' మిత్రుడ్ని తన పక్కన కూర్చోమని సంజ్ఞ చేశాడు రాహుల్.

''ఏమిటంత దీర్ఘంగా ఆలోచిస్తున్నావ్?''

''ఏమీ లేదు.''

''ఏమీ లేకపోవడమేమిట్రా. దేనికో నువ్వు బాధపడుతున్నట్టు అంత స్పష్టంగా కనిపిస్తుంటేను''

రాహుల్ మాట్లాడలేదు.

''పద. అలా పార్కులోకి వెళ్ళి మాట్లాడుకుందాం'' రాహుల్ చేయి పట్టుకుని లేపాడు ప్రసాద్.

మౌనంగా ప్రసాద్ వెంట నడిచాడు.

కాలేజీ రోజుల్నుంచి వున్న స్నేహం వాళ్లది. ఇద్దరికిద్దరూ అతి సామాన్య కుటుంబాలకు చెందినవాళ్లు. డిగ్రీ పూర్తి చేయగానే ప్రసాద్ ఓ చిరుద్యోగంలో చేరిపోతే, రాహుల్ మాత్రం ఆర్నెల్ల నుంచి ఇంకా ఒట్టిగానే వున్నాడు.

''ఇప్పుడు చెప్పరా. అసలేమిటి నీ బాధ?'' పచ్చికమీద సెటిలైన కొన్ని క్షణాలకు నిశ్శబ్దాన్ని బద్దలుకొట్టాడు ప్రసాద్.

రాహుల్ తటపటాయించాడు. అతనికి చిన్నప్పటి నుంచి తన ఇంటి విషయాలు పరులకు చెప్పే అలవాటు లేదు. వాళ్లు ఎంత స్నేహితులైనా సరే. ఇంటి విషయాలు బయటివారికి చెబితే వాళ్ల దృష్టిలో తను చులకనైపోతాను. అన్న భయం. చెప్పడానికి ఇష్టం లేకపోవడం మరో కారణం. దేనికైనా తనలో తనే కుమిలిపోయే ప్రవృత్తి అసలు కారణం.

''రాహుల్! నీకు చాలా రోజుల్నుంచి ఓ మాట చెప్పాలను కుంటున్నాను రా.'' రాహుల్ మాట్లాడకపోవడం చూసి తనే అన్నాడు ప్రసాద్.

ఏమిటో చెప్పమన్నట్లుగా అతని కళ్లలోకి చూశాడు రాహుల్.

''నీకెప్పుడైనా ఏదన్నా విషయానికి బాధ కలిగితే నువ్వొక్కడివే బాధపడకు. ఆ బాధను ఇంకెవరికైనా పంచి బాధపడు.''

''అలా చేస్తే ఏం లాభం రా. విన్నవాళ్ళ మనసు కూడా పాడవటం తప్ప, చెప్పి, నాతో పాటూ మరొకర్ని బాధ పెట్టే బదులు చెప్పకుండా నేనొక్కడ్నే బాధపడటం మంచిది కాదూ'' నిస్పృహగా అన్నాడు రాహుల్.

''ముమ్మాటికీ కాదు..ఆ మాటకొస్తే ఇప్పుడు నువ్వు నన్ను బాధ పెట్టడం లేదనే అనుకుంటున్నావా? నువ్వు బాధగా వుంటే నేను సంతోషంగా ఎలా వుంటాను? నువ్వు చెప్పకపోయినంత మాత్రాన నువ్వు బాధపడుతున్నట్టు నేను తెలుసుకోలేనా?''

''కాని నేను కావాలని...''

''ఎవర్నీ బాధపెట్టను అంటావు. అంతేగా. ఆ సంగతి నాకు తెలుసు. కాని అదే నువ్వు చేసే తప్పని నాకు అన్పిస్తోంది. నీ మనసులో బాధ మరొకరికి చెప్పుకుంటే మనసు తేలిక పడుతుంది. అంటే నా ఉద్దేశం పనిగట్టుకుని అందరికీ చెప్పమని కాదు. కనీసం నాలాంటి స్నేహితులు ఎదురైనప్పుడైనా చెప్పొచ్చుకదా అన్నదే నా పాయింటు.''

''ఏం చెప్పమంటావురా?'' రాహుల్ గుండె గొంతులో కొట్టుకుంటోంది.

''ఏముందో అదే చెప్పు. దానికింత ఆలోచన దేనికి. కాని...ఈరోజు మాత్రం నువ్వెందుకు బాధపడ్తున్నావో చెప్పందే నేను నిన్ను వదిలిపెట్టను. అర్థమయ్యిందా?''

కొన్ని క్షణాలు నిశ్శబ్దం.

''మా ఇంట్లో ఏమీ బాగోలేదు.'' తనలో తనే అనుకుంటున్నట్టుగా అన్నాడు రాహుల్ అసంకల్పితంగా.

''ఏం. డబ్బుకేమన్నా ఇబ్బందిగా వుందా?''


''అలాంటిదేం లేదు. మా నాన్న తెచ్చే జీతం ఎలాగోలా సరిపోతుంది. కాని మా అమ్మే.''

''ఆగిపోయావేం. చెప్పు. ఏమయ్యింది మీ అమ్మకు?''

''మా అమ్మకేమీ కాలేదుగాని మా అందరి ప్రాణాలూ తీస్తుంది. చాలా న్యూసెన్సు చేస్తుంది.''

''ఏం చేస్తుంది?''

''అయినదానికి కాని దానికి ఊరికే



తిడుతుంది. ప్రతిదానికీ తిట్లే. ప్రతిదానికీ అరుపులే. అసలు తిట్టడానికే పుట్టిందా అన్నట్లు ప్రవర్తిస్తోంది.''

''ఎప్పట్నుంచి ఇలా?''

''నాకు ఊహ తెలిసిన దగ్గర నుంచీ మా అమ్మ ఇంతే. కాకపోతే ఇప్పుడు మరీ ఎక్కువయ్యింది.''

''మీ నాన్నగారేమీ అనరా?''

''ఆయన కంట్రోల్ చేయగలిగితే ఇంకేం. ఏ సమస్యా వుండేది కాదు. కాని, పాపం ఆయన కూడా అమ్మ నోటికి బలైపోతున్నారు. ఒక్క నాన్నగారే ఏమిటి, నేను, తమ్ముడు, చెల్లాయ్- అందరం అమ్మ నోటికి బలైపోతున్నాం. ఒకసారి మా నాన్నగారన్నట్లు- అది నోరు కాదు, పందుల పెంట కుప్ప.''

''అసలెందుకు తిడుతుంది మీ అమ్మ?''

ఆ ప్రశ్నకు రాహుల్ వేదాంతిలా నవ్వాడు.

''ఇందుకు తిడుతుంది, ఇందుకు తిట్టదు అన్న రూలేమీ లేదు. దేనికి పడితే దానికి తిడుతుంది. ఎప్పుడు పడితే అప్పుడు తిడుతుంది. అందులోనూ మా అమ్మ గొంతు ఇలాంటలాంటి గొంతు కాదు. ఇక్కడ అరిస్తే పక్క వీధి వరకూ విన్పిస్తుంది. ఆమెకు కోపం వచ్చిందంటే ఇంట్లో అందరం జీవచ్ఛవాల్లా ఉండవలసిందే. లేకపోతే మరీ విపరీతంగా గోల పెడుతుంది. పచ్చి బూతులు కూడా తిట్టడానికి వెనుకాడదు.''

''వెరీ బ్యాడ్.''


''ఒక్క గయ్యాళిగంప వల్ల ఇంటిల్లిపాదీ ఎంత నరకం అనుభవిస్తారో మా ఇంటిని చూస్తే చాలన్పిస్తుంది.'' అతని గొంతులో అనంతమైన వేదన.

ఓదార్పుగా ఏదన్నా అనడానికి కూడా ప్రసాద్‌కి గొంతు పెగలలేదు. కొందరంతే. తమ వల్ల కుటుంబంలోని మిగతా వ్యక్తులు ఎంత చిత్రవధకు గురవుతున్నారో అన్న కనీస స్పృహ కూడా లేకుండా రాక్షసుల్లా ప్రవర్తిస్తారు. ఇలాంటి కుటుంబాలు కొన్ని వేలు, లక్షలూ ఉంటాయ్. కొన్నిచోట్ల ఈ నరకానికి మగవాడు కారణమైతే, మరికొన్ని చోట్ల ఆడది! అంతే తేడా.

''నీకు గుర్తుందా ప్రసాద్! మనం ఇంటర్ చదివేటప్పుడు ఓ నాలుగైదుసార్లు నువ్వు నాతో పాటూ మా ఇంటికి వస్తానని అన్నావ్. అలా నువ్వన్న ప్రతిసారీ 'మరోసారి తీసుకెళ్తాలేరా' అని అన్నానేగాని నిన్ను తీసుకెళ్లలేదు. ఆ తర్వాత నువ్వు మళ్లీ అడగనూ లేదు. నేను నిన్ను తీసుకెళ్లనూ లేదు. దానికి కారణమేమిటో తెలుసా ప్రసాద్? మా అమ్మ!..నేను మాత్రమే కాదు, మా తమ్ముడూ, చెల్లీ కూడా తమ స్నేహితులెవరినీ మా ఇంటికి పిలవరు.''


''ఎందుకని? దానిక్కూడా మీ అమ్మ కోప్పడుతుందా?''


''లేదు. మూడ్ బాగుంటే మా స్నేహితుల్ని ఎంతో చక్కగా ఆదరిస్తుంది. కాని..ఎవర్నయినా ఇంటికి తీసుకొచ్చేసరికి మా అమ్మ ఏ స్థితిలో వుంటుందో, ఆ సమయంలో ఆమె నోటి నుంచి ఎలాంటి తిట్లూ అరుపులూ విన్పిస్తూ వుంటాయో అని మా భయం. స్నేహితులు ఇంటికొచ్చేసరికి మా అమ్మ అరుస్తూ వుంటే- అది మాకు చాలా అవమానంగా వుంటుంది. అందుకే ఎవర్నీ ఇంటికి పిలిచే సాహసం చెయ్యము.''



''మీ అమ్మ అరుపులకి మీ ఇరుగుపొరుగులేమీ అనరా?''

''వాళ్లు కూడా ఏదో ఒక సందర్భంలో మా అమ్మ నోట్లో నోరు పెట్టి తోకముడిచిన వాళ్లే. వాళ్లెవరితోనూ మాకు మాటలు లేవు. అసలు మా వీధిలో ఎప్పుడు నడచినా మా నాన్నతో సహా మేమందరం- ఏదో నేరం చేసిన వాళ్లలా తలలొంచుకునే వుంటాము. వీధి మొత్తం దాటే వరకు ఇదే స్థితి. అసలు మా అమ్మకు ఏం కావాలో మాకు అర్థం కాదు. ఆమె ఎందుకంత క్రూరంగా ప్రవర్తిస్తుందో అర్థం కాదు. మామూలుగా వున్నప్పుడు బాగానే వుంటుంది. కాని కోపం వచ్చినప్పుడే రాక్షసిలా ప్రవర్తిస్తుంది.''




''ఎవరైనా డాక్టర్‌కి చూపించలేకపోయారా?''

''అదీ అయ్యింది. హైబీపీ అంటాడు. అందరూ కలసి ఆమెను జాగ్రత్తగా చూసుకోండి అంటాడు. లేకపోతే గుండెపోటులోకి దిగే ప్రమాదముంది అంటాడు. మాకేం చేయాలో తోచటం లేదురా. అందరం కలసి ఇంత ఎండ్రిన్ తాగి...''

మాట పూర్తి చేయకుండానే దుఃఖం అతని గొంతుని పూడ్చేసింది. హఠాత్తుగా కరిగిన మేఘంలా వెక్కి వెక్కి ఏడ్వడం మొదలుపెట్టాడు.

కొన్ని నిమిషాల వరకు ప్రసాద్ మౌనంగా ఊరుకున్నాడు.

''ఊరుకో రాహుల్. కొన్ని కొన్ని మన చేతుల్లో వుండవు. కంట్రోల్ యువర్‌సెల్ఫ్.'' రాహుల్ భుజం మీద సున్నితంగా నిమురుతూ లాలించాడు.

కాని... అతని దుఃఖం గోదారిలా ఉప్పొంగింది.

ఓ అరగంట వరకు అతను మామూలు మనిషి కాలేకపోయాడు.

ఇప్పుడతని మనసు ఎంతో తేలికగా వుంది. మనసులోని బాధ మరొకరికి చెప్పుకుంటే ఇంత ఉపశమనం కల్గుతుందా! అతనికి ఆశ్చర్యంగా వుంది.

''సారీ ప్రసాద్. నిన్ను ఇబ్బంది పెట్టినట్లున్నాను.'' సన్నటి చిరునవ్వుతో అన్నాడు.

మంచు బిందువుల మీద సూర్యకాంతి పడినట్లుగా వుంది ఆ నవ్వు! ఎంతో అందంగా!

''నీ బాధను పంచుకోడంలో నాకేం ఇబ్బందిరా. నీలో నువ్వు కుమిలిపోకుండా ఎవరో ఒకరికి పంచమనే కదా నేను చెప్పేది.'' ప్రసాద్ కూడా నవ్వుతూ అన్నాడు.

రెండు నిమిషాల నిశ్శబ్దం.

''పద... అలా టౌన్‌లోకి వెళ్లి ఏదన్నా మంచి సినిమా వుంటే చూద్దాం.'' ప్రసాద్ అన్నాడు.

రాహుల్ బుద్ధిగా తలూపాడు.

★★★

సినిమా విడిచిపెట్టగానే ఇద్దరూ ఒకరికొకరు గుడ్‌బై చెప్పుకున్నారు.

రాహుల్ ఇల్లు అక్కడికి ఓ మైలున్నర దూరంలో వుంది. నడుస్తూనే బయలుదేరాడు.

ఇప్పుడతని మనసంతా బాధగా వుంది.

ఛీ. ఈరోజు తనకేమయ్యింది. అమ్మ గురించి అంత చెడుగా ఎలా మాట్లాడాడు? అమ్మని మూర్ఖురాలన్నాడు. గయ్యాళిగంపన్నాడు. రాక్షసిలా ప్రవర్తిస్తోందని అన్నాడు. ఇంకా చాలా చాలా అన్నాడు. ఎందుకలా అన్నాడు? ఛీఛీ..అలా అనకుండా వుండవలసింది. అమ్మ గురించి అంత హీనంగా మాట్లాడకుండా ఉండవలసింది.

కోపం వచ్చినప్పుడు ఆమె ఉచ్చనీచాలు మరచి రాక్షసిలా ప్రవర్తించే మాట నిజమే. అయినా మామూలుగా వున్నప్పుడు ఆమె అందరి అమ్మలాంటిదేమ్మోగా. క్షణం తీరిక లేకుండా ఇంట్లో పనిచేస్తుంది. తమ అందరికీ వండి పెడుతుంది. తమ బట్టలు ఉతుకుతుంది. ఎంగిలి కంచాలు కడుగుతుంది. రోగాలూ రొష్టులూ వచ్చినప్పుడు నానా హైరానా పడిపోతుంది. అన్నిటినీ మించి ఆమె తమను నవమాసాలూ మోసి, కని, పెంచింది. కనీసం అందుకు కృతజ్ఞతగా అయినా అమ్మ గురించి తనలా మాట్లాడకుండా వుండవలసింది. కాని అప్పుడు తనకు ఇవన్నీ ఎందుకు గుర్తు రాలేదు?!

ప్రసాద్ కదిలించగానే ఎన్నడూ లేని విధంగా బడ బడా మాట్లాడేశాడు. అప్పుడవన్నీ చెబుతున్నప్పుడు ఏమీ అన్పించలేదు. కాని ఇప్పుడు మాత్రం అలా చెప్పినందుకు బాధగా వుంది.

తనకు బాధగా వుంటే ఆ బాధను తనలోనే వుంచుకోవలసింది. లేదా ఎక్కడో ఎవ్వరూ చూడని చోట ఒంటరిగా కూర్చుని బావురుమని ఏడ్చేయవలసింది. అలా ఎన్నిసార్లు చేయలేదు తను. కాని ఈరోజేమయ్యింది తనకు? ప్రసాద్ ముందు అలా బద్దలైపోయాడెందుకు?...

రాహుల్‌కి ఇప్పుడు బాధగా వుంది.

నీ బాధేమిటని ప్రసాద్ అడిగినప్పటి కంటే ఇప్పుడు ఎక్కువ బాధగా వుంది.

తన గుండెనెవరో మెలిపెడుతున్నట్టుగా బాధ పడుతున్నాడతను.

★



## పాపం సుస్మిత!

మాజీ మిస్ యూనివర్స్ అయినా సినీ తారగా మాత్రం ఇంకా సరిగ్గా రాణించలేకపోతోంది సుస్మితా సేన్. ఆమె తొలి చిత్రం 'దస్తక్' అట్టర్ ఫ్లాప్. అలాగే దక్షిణాది భారీ చిత్రం 'రక్షకన్' కూడా విజయం సాధించలేదు. ఇప్పుడు సుస్మితా సేన్ నటించిన తాజా హిందీ చిత్రం 'జోర్' ఈమధ్య విడుదలైంది. ఇది కూడా ఫ్లాపే! సన్నీ హీరోగా నటించిన ఈ చిత్రాన్ని తన ఫ్రెండ్స్ బోల్డంత మందిని ప్రత్యేకంగా థియేటర్స్‌కి తీసుకువెళ్లి మరీ చూపించిందిట సుస్మిత. తనే టికెట్స్ కొని ముంబాయిలోని వివిధ థియేటర్స్‌లో ఈ సినిమాని తన స్నేహితురాళ్లకి చూపించడం చూసిన వాళ్లంతా 'పోనీ లెండి...ఈ వంకతో నైనా కాస్త కలెక్షన్లుంటాయి. అసలే థియేటర్‌లలో ఈగలు తోలుకుంటున్నారు' అంటూ గుసగుసలు చెప్పుకుంటున్నారు. ప్చ్! సుస్మిత!

-జె.ఎం.